రేవంత్ కంటికి రెప్పలా బీజేపీ

- సుంకిశాల, ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదాలపై స్పందించకపోవడానికి కారణమిదే
- రేవంత్ సరైన సమయంలో పార్టీలో చేరుతానన్నందుకే చర్యలు తీసుకోని కేంద్రం
- కాళేశ్వరంపై ఆగమేఘాలపై స్పందన
- ఇప్పుడు మౌనం వెనుక మతలబు అదే
- కాంగ్రెస్ అవినీతి, అరాచకాలపై బీజేపీ స్పందించకుంటే మేం అలానే భావిస్తాం
- ఇకనైనా బీజేపీ చిత్తశుద్ధిని చాటుకోవాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ) : బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అన్నివేళలా కంటికిరెప్పలా.. రక్షణ కవచంలా నిలబడుతున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాజకీయంగా ఢిల్లీలో కొట్లాడుతూ తెలంగాణలో మాత్రం బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అన్ని రకాల రక్షణలను కల్పిస్తూ ఆయనను కంటికిరెప్పలా కాపాడుతున్నదని దుయ్యబట్టారు. దాదాపు 15 నెలల కాలంలో ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ ముఖ్యమంత్రి అనేక స్కామ్‌లకు పాల్పడుతున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని తెలిపారు. నాడు కాళేశ్వరం ప్రాజెక్టు ప్రమాదంపై ఆగమేఘాల మీద స్పందించి కేంద్ర ప్రభుత్వ సంస్థలను రంగంలోకి దించి, విచారణల పేరుతో వేధింపులకు పాల్పడిన బీజేపీ ప్రభుత్వం ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో సుంకిశాల ప్రాజెక్టులో రిటైనింగ్‌వాల్ కూలిన ప్రమాదంతో పాటు తాజాగా ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన పెను ప్రమాదాలపై కనీసం స్పందించకపోవటం వెనుక అనేక అనుమానాలున్నాయని ఆదివారం ఎక్స్‌వేదికగా పేర్కొన్నారు. గతంలో ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యామ్ సెఫ్టీ అథారిటీ), ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థలు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్పందించిన విధంగా జరిగిన ప్రమాదాలపై విచారణ చేసి, కారణాలు కనుక్కొని ప్రజలకు వివరిస్తాయా? లేక ఎప్పటిలానే ఇక్కడి కాంగ్రెస్ ముఖ్యమంత్రిని కాపాడేందుకు ప్రయత్నం చేస్తాయా? అనే విషయాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా రాహుల్‌గాంధీ బీజేపీపై విమర్శలు చేస్తూ పోరాటం చేస్తున్నట్టు చెప్పుకొని తిరుగుతుంటే తెలంగాణలో మాత్రం కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయని అనేకసార్లు స్పష్టమైందని ఉదహరించారు.

రేవంత్ బీజేపీలో చేరే సరైన సమయం కోసం..

రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ ఎందుకు కాపాడుతున్నదో అంతుచిక్కటం లేదని, అది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారిందని కేటీఆర్ విమర్శించారు. తాజాగా రేవంత్‌రెడ్డి సరైన సమయంలో బీజేపీలో చేరుతానని హామీ ఇచ్చి లోపాయికారి ఒప్పందం చేసుకోవడం వల్లే తెలంగాణ కేంద్ర మంత్రులతో సహా మొత్తం బీజేపీ నాయకులు రేవంత్‌రెడ్డిని కాపాడుతూ రక్షణ కవచంగా నిలుస్తున్నారని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తానుచేస్తున్న ఆరోపణలో వాస్తవం లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అవినీతి, అరాచకాలపై వెంటనే స్పందించి తన చిత్తశుద్ధి బీజేపీ నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్రం ఉలుకూపలుకూ లేదెందుకో?

కేంద్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖకు చెందిన రూ.1337 కోట్ల నిధులను సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత బావమరిదికి అప్పనంగా కట్టబెట్టి, అమృత్ పథకంలో చేసిన స్కాంకు సంబంధించిన పూర్తి వివరాలను కేంద్ర ప్రభుత్వానికి స్వయంగా వెళ్లి అందజేశామని, సాక్ష్యాలు అందించినా ఇప్పటికీ కేంద్రం స్పందించకపోవటం అంటే రేవంత్‌రెడ్డిని కాపాడుతున్నట్టేనని కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ సంస్థల నుంచి చదరపు అడుగుకు రూ.150 చొప్పున ఆర్ ఆర్ (రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ) ట్యాక్స్ పేరిట పన్ను వసూలు చేస్తున్నదని ప్రధాని మోదీ స్వయంగా పేర్కొన్నారని, కనీసం వాటిపై బీజేపీ ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రి పొంగులేటిపై ఈడీ దాడులు చేసి, భారీగా నగదు, ఆస్తులను గుర్తించినట్టుగా వార్తలు వచ్చి ఐదు నెలలు దాటినా ఇప్పటికీ అటు ఈడీ గాని, ఇటు మంత్రిగాని వాటిపై అధికారిక ప్రకటన కూడా విడుదల చేయలేదని గుర్తుచేశారు.

తుప్పు.. తుక్కుగా నీరా యూనిట్!

- 12 కోట్లతో నీరా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటుచేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- దీని ద్వారా వేలాది గౌడ్‌లకు ఉపాధి లక్ష్యం
- ఒక్కొక్కరు నెలకు 30 వేలకు పైగా సంపాదించుకునే అవకాశం
- మూలకు పడేసిన కాంగ్రెస్ సర్కార్
- తీవ్రంగా నష్టపోతున్న కల్లుగీత కార్మికులు

యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలోని నీరా ప్రాసెసింగ్ యూనిట్

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వేలాది గీత కార్మికులకు నీరా ద్వారా ప్రత్యక్షంగా ఉపాధి కల్పించాలని, కల్తీలేని కల్లు, స్వచ్ఛమైన నీరాను రాష్ట్ర ప్రజలకు అందించాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలో రూ.12 కోట్లతో నీరా ప్రాసెసింగ్ యూనిట్‌ను నిర్మించింది. అందుకు కావల్సిన ఆధునిక యంత్రసామగ్రిని గత ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఆ ప్రాజెక్టును పూర్తి చేసే క్రమంలో అసెంబ్లీ ఎన్నికలకు కోడ్ రావడం, ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో, దానిని పట్టించుకున్న దిక్కు లేకుండా పోయింది. దీంతో కోట్లాది రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన యంత్రాలు, ఇతర సామగ్రి తుప్పుపట్టిపోతున్నాయి. ఆ ప్రాజెక్టు ఎలా ఉన్నది? దానిపై పెట్టిన ఖర్చు నుంచి లాభాలు తీసుకోవడం ఎలా? దాని ద్వారా ఎన్ని వేల మందికి ఉపాధి దొరుకుతుంది? తద్వారా ప్రభుత్వానికి ఎంత మంచి పేరు రానున్నది? అనే విషయాలేవీ ఈ ఏడాదిన్నర కాలంలో పట్టించుకున్న దిక్కు లేదు. ఇటు ఎక్సైజ్‌శాఖ అధికారులు, మంత్రులు నందనం నీరా ప్రాసెసింగ్ యూనిట్‌పై దృష్టిపెట్టకపోవడం వల్లనే యంత్రాలు తుప్పు పట్టిపోతున్నాయని నందనం పరిసర ప్రాంతాల్లోని కల్లుగీత కార్మికులు చెప్తున్నారు.

వేలాది మందికి ఉపాధి

నందనంలోని నీరా ప్రాసెసింగ్ యూనిట్ అందుబాటులోకి వస్తే, అన్ని మండల హెడ్ క్వార్టర్స్‌లో నీరాకేఫ్‌లు ప్రారంభించి, వాటి ద్వారా స్వచ్ఛమైన నీరాను రాష్ట్ర ప్రజలకు అందించాలనేది గత ప్రభుత్వ లక్ష్యం. దీని ద్వారా కల్తీ కల్లును నివారించి, అవసరమైతే స్వచ్ఛమైన కల్లును గౌడన్నల ద్వారానే విక్రయించాలనే ఆలోచన కూడా చేసింది. గత ప్రభుత్వం అనుకున్నట్టుగా నందనం నీరా ప్రాసెసింగ్ యూనిట్ అందుబాటులోకి వస్తే, రాష్ట్రవ్యాప్తంగా గీతకార్మికులకు ప్రత్యక్షంగా ఉపాధి లభించేది. ఒక్కో గీత కార్మికుడు నెలకు ఒక్క నీరా సేకరించడం వల్లనే రూ.30-40వేలు సంపాదించుకునే అవకాశం ఉన్నది. నీరాకు తోడు గీత కార్మికులు కల్లు అమ్ముకుంటే, నెలకు ప్రత్యక్షంగా కనీసం రూ.50వేలు సంపాదించుకుని ఆర్థికంగా స్థిరపడేలా గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రణాళికలు రచించారు. ఈ క్రమంలోనే భువనగిరి జిల్లాలోని నందనం వద్ద, రంగారెడ్డి జిల్లా ముద్విన్, సంగారెడ్డి జిల్లా మునిపల్లి, నల్లగొండ జిల్లా సర్వేల్‌లో నీరా సేకరించే కేంద్రాలను ఎంపిక చేసి, కొంత నిధులను మంజూరు చేశారు. వీటి ద్వారా వేలాది మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యం.

చరికొండ నుంచే ఆపరేషన్స్

గత ప్రభుత్వం నీరా పాలసీ తీసుకొచ్చిన తర్వాత రంగారెడ్డి జిల్లా చరికొండలోని నీరా సేకరణ కేంద్రాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. నీరా చెట్టు నుంచి తీసిన తర్వాత మూడు రోజులపాటు నిల్వ ఉంచడం కోసం చేసిన ప్రయోగాలన్నీ విజయవంతం అయ్యాయి. దీంతో చరికొండ నుంచే ప్రస్తుతం నీరా సేకరిస్తున్నారు. ఆ నీరాను ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్‌లోని నీరా కేఫ్‌కు తరలించి ప్యాకింగ్ చేయించి విక్రయిస్తున్నారు. దీంతో ఆ చుట్టుపక్కల గ్రామాల్లో కల్లు గీత కార్మికులకు నీరా సేకరణ ఆదాయ వనరుగా మారింది. తద్వారా ఎంతోమంది కల్లుగీత కార్మికులు నెలకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదిస్తున్నారు. దీనికితోడు కల్లు అమ్ముకుంటున్న వారికి నెలకు సుమారు రూ.40 వేల వరకు లాభం చేకూరుతుందని అంటున్నారు.

నీరా యూనిట్‌ను ఉపయోగంలోకి తేవాలి

గత ప్రభుత్వం కోట్ల రూపాయలతో ఏర్పాటుచేసిన నందనంలోని నీరా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించి, దానిని ఉపయోగంలోకి తీసుకురావాలి. ఇప్పటికే ప్రభుత్వం కల్లుగీత కార్మికులపై చిన్నచూపు చూస్తున్నది. వేలాది గీత కార్మికులకు మేలు చేసే పనిని తక్షణం చేపట్టాలి. కోట్లాది రూపాయల విలువైన యంత్రాలు తుప్పు పట్టిపోతుంటే, ప్రభుత్వంలో కనీసం చలనం లేకపోవడం దారుణం. ఇది ముమ్మాటికీ గౌడన్నల ఆర్థిక మూలాలపై దెబ్బ కొట్టడమే.

- శ్రీనివాస్‌గౌడ్, ఎక్సైజ్‌శాఖ మాజీ మంత్రి

కాంగ్రెస్ సర్వే ఫేక్

- తేల్చి చెప్పిన సర్వే సంస్థ
- ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పారని కాంగ్రెస్ పాచిక

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ వేసిన పాచిక పజీత పాలైందని పట్టభద్రులు మండిపడుతున్నారు. పార్టీకి లబ్ధిచేకూర్చుకొనే ప్రయత్నాలకు ఒడిగడుతూ తమను అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయమని ఇండియా టుడే -యాక్సిస్ మై ఇండియా సర్వే తేల్చినట్టు ఆ పార్టీ అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు ప్రత్యక్షమైంది. ఈ స్థానం కోసం బరిలో నిలిచిన అభ్యర్థులకు ఎవరెవరికి ఎంత పోలింగ్ నమోదవుతుందో చెప్తూ ఈ పోస్ట్ చక్కర్లు కొడుతున్నది. పోలింగ్‌కు ముందు ఎలాంటి సర్వేలు చేయకూడదని, ఒకవేళ చేసినా వాటిని పబ్లిక్ డొమైన్లో పెట్టకూడదని ఎన్నికల ప్రవర్తనా నియమావళి స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అసలు సదరు సంస్థ సర్వే చేసిందా? అన్న అనుమానాలు సంబంధిత నియోజకవర్గాల అభ్యర్థుల్లో వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ ఇండియా టుడే-యాక్సెస్ మై ఇండియా సర్వే సంస్థ బాధ్యులను కాంగ్రెస్ సర్వే విషయంపై ప్రశ్నించారు. దీనికి సదరు సంస్థ బాధ్యుడు 'అది ఫేక్' అని క్రిశాంక్‌కు ఎక్స్ వేదికగా బదులిచ్చారు. మొత్తానికి కాంగ్రెస్ పార్టీ సాధారణ ఎన్నికల్లో అనుసరించిన తప్పుడు మార్గాలనే విద్యాధికులు ఓటర్లుగా ఉన్న పట్టభద్రుల నియోజకవర్గంలోనూ పాటిస్తూ లబ్ధిపొందాలని చూస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేడు సింగరేణి భవన్‌కు క్వీన్స్‌లాండ్ మంత్రి రాక

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ ఆర్థిక, వాణిజ్య, ఉపాధి, శిక్షణ శాఖ మంత్రి రాస్‌బేట్స్ సోమవారం సింగరేణి భవన్‌ను సందర్శించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సింగరేణి అధికారులతో ప్రత్యేక సమావేశమై.. మైనింగ్‌రంగంలో అధునాతన టెక్నాలజీపై చర్చించనున్నారు. వనాడియం, కాపర్, గ్రాఫైట్, కోబాల్ట్ తదితర వాటిపై సింగరేణి-క్వీన్స్‌లాండ్ మధ్య పరస్పర సహకారంపై చర్చలు జరపనున్నారు. సింగరేణి భవన్‌ను సందర్శించిన తొలి విదేశీ మంత్రిగా రాస్‌బేట్స్ నిలుస్తారని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ తెలిపారు.

రాత్రి 9 వరకు తవ్వుకోండి

- ఇసుక క్వారీల్లో లోడింగ్‌కు టీజీఎండీసీ ఉత్తర్వులు
- కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు నిలువునా పాతర
- సమయం పొడిగింపుపై ఎన్‌జీటీలో క్రిశాంక్ పిటిషన్



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): ఇసుక క్వారీల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం 7 గంటల వరకే తవ్వకాలు నిర్వహించాలన్న కేంద్ర మార్గదర్శకాలకు రాష్ట్ర ప్రభుత్వం నిలువునా పాతరేసింది. ఇకపై రాత్రి 9 గంటల వరకు ఇసుక లోడింగ్ పనులను నిర్వహించాలని టీజీఎండీసీ శనివారం ఆదేశాలు జారీచేసింది. ఇప్పటివరకు కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకే ఇసుక క్వారీలు పనిచేశాయి. కానీ, ఇటీవల ఇసుక రవాణాపై ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించడం, తనిఖీల పేరుతో రవాణాను కట్టడి చేయడంతో హైదరాబాద్‌లో ఇసుకకు తీవ్ర కొరత ఏర్పడింది. రవాణా, మైనింగ్ అధికారులు వేధిస్తుండడంతో టిప్పర్ల యజమానులు పక్షం రోజులుగా హైదరాబాద్‌కు ఇసుక రవాణాను నిలిపివేశారు. ఈ క్రమంలో టన్ను ఇసుక ధర ఏకంగా రూ.2,300కు పెరిగింది. ఫలితంగా చాలా ప్రాంతాల్లో నిర్మాణాలు నిలిచిపోయాయి. సరసమైన ధరకు ఇసుక అందించకుండా, ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది.

ఎన్‌జీటీలో పిటిషన్

కేంద్ర మార్గదర్శకాలకు విరుద్ధంగా రాష్ట్రంలో ఇసుక లోడింగ్‌కు అనుమతించడాన్ని సవాల్ చేస్తూ బీఆర్‌ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ జాతీయ హరిత ట్రిబ్యూనల్ (ఎన్‌జీటీ)లో పిటిషన్ దాఖలు చేశారు. ఇసుక లోడింగ్ సమయాన్ని పొడిగిస్తూ టీజీఎండీసీ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్

కాంగ్రెస్ మాటలు నీటి మూటలే

- రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్

కూసుమంచి, ఫిబ్రవరి 23 : గత ఎన్నికల్లో ఉద్యమకారులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 15 నెలలు అవుతున్నా వాటి ఊసెత్తడంలేదని రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ మండిపడ్డారు. ఆదివారం ఖమ్మంజిల్లా కూసుమంచి మండల కేంద్రంలో జిల్లా ఉద్యమకారుల జేఏసీ ఆత్మీయ సమ్మేళనం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుల్తాన్ మాట్లాడుతూ బలిదానాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది ఉద్యమకారులు త్యాగాలు చేశారని గుర్తుచేశారు. బత్తుల సోమయ్య మాట్లాడుతూ ఉద్యమకారుల త్యాగాలపై ఏర్పడిన తెలంగాణలో వారికి గుర్తింపు ఇవ్వాలని కోరారు.



మహబూబాబాద్ జిల్లాలో అకాల వర్షం

- బయ్యారం,కురవి మండలాల్లో మిర్చి రైతుకు నష్టం

కురవి/బయ్యారం, ఫిబ్రవరి 23: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంతోపాటు కురవి మండలం కొత్తూరు(జీ) శివారు బంచరాయితండా గ్రామంలో ఆదివారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. చేతికొచ్చిన మిర్చి పంటను తెంపి కల్లాల్లో ఆరబెట్టిన రైతులు ఆగమయ్యారు. మద్దతు ధరలేక రైతులు అనేక ఇబ్బందులు పడుతుంటే మరోవైపు వాతావరణ పరిస్థితులు వెక్కిరిస్తున్నాయి. వర్షం పడటంతో కల్లాల్లో మిర్చిపై వెంటనే రైతులు పరదాలు కప్పగా, కొందరి మిర్చి పంట స్వల్పంగా తడిసింది.

నీరాకేఫ్‌ను తరలిస్తే అగ్నిగుండమే

ఉద్దేశపూర్వకంగానే భ్రష్టు పట్టిస్తున్నరు • ఇది మా గౌడన్నల ఆత్మగౌరవ పతాక

టచ్ చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలే! • వారంలో నిర్ణయం వాపస్ తీసుకోవాలి: శ్రీనివాస్‌గౌడ్

- లేదంటే అసెంబ్లీ, సచివాలయంతోపాటు హైదరాబాద్ ముట్టడి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం
- గౌడ సంఘాల నాయకులతో కలిసి నీరాకేఫ్ సందర్శన



గౌడ సంఘాల నాయకులతో కలిసి హైదరాబాద్‌లోని నీరా కేఫ్ వద్ద నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరం నడిగడ్డపై ఉన్న నీరాకేఫ్‌ను తరలించడమంటే, గౌడన్నల గుండెలపై తన్నడమేనని ఎక్సైజ్‌శాఖ మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వారం రోజుల్లో ప్రభుత్వ నిర్ణయాన్ని వాపసు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే అసెంబ్లీ, సెక్రటేరియట్ సహా హైదరాబాద్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. 'త్వరలో నీరాకేఫ్ ఎత్తివేత?' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైన నేపథ్యంలో ఆదివారం ఆయన నెక్లెస్ రోడ్డులోని నీరాకేఫ్‌ను గౌడ సంఘాలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతోనే నీరాకేఫ్ రూపురేఖలు మార్చారంటూ మండిపడ్డారు. కులవృత్తులను పునరుద్ధరించాలన్న లక్ష్యంతో నాడు కేసీఆర్ ఎన్నో ఆలోచనలు చేశారని, వాటిల్లో నీరాకేఫ్ ఒకటి అని వివరించారు. 'నా జాతిలో ఉన్న అమృతం లాంటి నీరాను ప్రపంచానికి మరోసారి పరిచయం చేశాం. బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.20 కోట్లతో దేశంలో ఎక్కడా లేనివిధంగా నీరా పాలసీ తీసుకొచ్చాం. వైన్‌షాపుల్లో కూడా రిజర్వేషన్లు ఇచ్చాం. నెక్లెస్ రోడ్‌లో ఆధునికీకరించిన బిల్డింగ్‌లో నీరాకేఫ్‌ను ఏర్పాటు చేస్తే, దాన్ని నిర్వహించడం చేతగాక ఎత్తివేసే కుట్ర చేస్తున్నారు' అని మండిపడ్డారు.

రూపురేఖలు మారుస్తారా?

నీరా పాలసీ, నీరా కేంద్రాన్ని ఎత్తేస్తూ ప్రైవేట్‌పరం చేయాలనుకోవడం బాధాకరమని శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. బీసీ జనాభా జాబితాలో గౌడ సామాజికవర్గం సంఖ్య దాదాపు 30 లక్షల మంది ఉంటే, 16 లక్షల మందిగా చూపించారని మండిపడ్డారు. ఇప్పటికే గౌడ కులస్తులపై అక్రమ కేసులు పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం వేధిస్తున్నదని విమర్శించారు.

గీతకార్మికులతో ధర్నా చేస్తాం

నీరాకేఫ్‌ను ఎత్తివేయాలనే ఆలోచనను అన్ని కులాలవారు వ్యతిరేకించాల్సిన అవసరం ఉన్నదని శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. 'మేం తెచ్చిన నీరా కేంద్రాలను జిల్లాల్లో విస్తరిస్తారనుకున్నాం. కానీ ఉన్నవి తీసేస్తారని అనుకోలేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. గీతకార్మిక సోదరులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. గౌడ ఐక్యసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్ మాట్లాడుతూ.. గౌడన్న అస్థిత్వ ప్రతీకపై దెబ్బకొట్టొద్దని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. గౌడజన హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నీరాకేఫ్‌ను తీసుకొస్తే.. ఈ ప్రభుత్వం దాన్ని ఎత్తివేసే కార్యక్రమం పెట్టుకున్నదని దుయ్యబట్టారు. తమ జోలికి వస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

నీరాకేఫ్‌ను ఎక్కడికీ తరలించం

- ఫుడ్‌కోర్టులు పెట్టడం సహజం
- ఎక్సైజ్ శాఖ మంత్రి కార్యాలయం ప్రకటన

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): నీరాకేఫ్‌ను ఎక్కడికీ తరలించే ఆలోచన తమకు లేదని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కార్యాలయం వివరణ ఇచ్చింది. నీరాకేఫ్‌లో ఫుడ్‌కోర్టులు పెట్టడం సహజమని సమర్థించుకున్నది. ప్రస్తుతం నీరాకేఫ్ వినోద్‌గౌడ్ నిర్వహణలోనే ఉన్నదని స్పష్టంచేసింది. నీరాకేఫ్‌ను హోటల్‌గా మార్చే ప్రతిపాదనలు ఏమీలేవని తెలిపింది. ఆదివారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన 'త్వరలో నీరాకేఫ్ ఎత్తివేత?' అనే కథనంపై మంత్రి జూపల్లి కార్యాలయం స్పందించింది. 'నమస్తే తెలంగాణ' కథనం నేపథ్యంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘాల నాయకులు నీరాకేఫ్‌ను సందర్శించిన వెంటనే మంత్రి కార్యాలయం నుంచి వివరణ రావడం ఆసక్తిగా మారింది. నీరాకేఫ్‌ను ఎత్తివేసి, దానిని హోటల్‌గా మార్చే ప్రయత్నం చేస్తుండటాన్ని ముందే పసిగట్టిన 'నమస్తే తెలంగాణ' కథనం రాయడం చర్చనీయాంశమైంది. అయితే, పథకం ప్రకారం కేఫ్‌లో అద్దాలు తొలగించడం వల్ల నీరా తాగుతూ సేదతీరుతున్న వారికి హుస్సేన్‌సాగర్ దుర్వాసన వచ్చి, రెండోసారి అటువైపు రావడం మానేస్తున్నారు. దీనికితోడు కేఫ్ వెనుకాల అంతా చెత్తకుప్పగా మార్చారు. నీరా బై ప్రొడక్ట్స్‌కు ప్రచారం కల్పించకపోవడంతో వాటిని కొనుగోలు చేసేవారి సంఖ్య క్రమంగా తగ్గుతున్నది. ఆఘమేఘాల మీద మంత్రి కార్యాలయం ఇచ్చిన వివరణ కూడా తేదీలతో తప్పులు తడకగా ఉన్నది. దానిని ఎక్సైజ్ శాఖ కార్యాలయం నుంచి ఇస్తున్నారా? టూరిజం శాఖ నుంచి ఇస్తున్నారా? అనే స్పష్టత కూడా లేదు. ఇచ్చిన వివరణలోనూ కనీసం మంత్రి ప్రస్తావన, కార్యాలయ ప్రస్తావన లేకపోవడం గమనార్హం.

తెలంగాణ మిర్చి రైతులకు దిక్కేది?

- ఏపీ మిర్చి రైతులకు కేంద్రం ఊరట
- ఎంఐఎస్ కింద క్వింటాకు 11,781 చొప్పున ధర కల్పించేందుకు నిర్ణయం
- సర్కారు నిర్లక్ష్యం.. తెలంగాణ రైతుల మండిపాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 23(నమస్తే తెలంగాణ): తెలంగాణ మిర్చి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రాష్ట్రంలోని రైతుల పరిస్థితిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇటు రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ నుంచి, అటు కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ మిర్చి రైతులకు మద్దతు లేకుండాపోయింది. ఇదే దశలో ఏపీ మిర్చి రైతులకు మాత్రం కేంద్రం నుంచి ఊరట లభించింది. అక్కడి మార్కెట్లో మిర్చి ధర పతనమైన నేపథ్యంలో మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం(ఎంఐఎస్) కింద క్వింటాకు రూ.11,781 చొప్పున ధర కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని టీడీపీ ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. తొలుత మొత్తం పంట ఉత్పత్తిలో 25 శాతం కొనుగోలుకు అంగీకరించిందని, అవసరమైతే మరింత పంట కొనుగోలుకు కేంద్రం సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. దీంతో ఏపీ బహిరంగ మార్కెట్లో మిర్చి పంటకు కొంత డిమాండ్ పెరిగే అవకాశం ఏర్పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో తెలంగాణలో మాత్రం అలాంటి పరిస్థితి లేకుండా పోయింది. ఏపీ ప్రభుత్వం అక్కడి రైతుల కోసం కేంద్రంతో మాట్లాడితే.. తెలంగాణ సర్కారు మాత్రం రైతులను గాలికి వదిలేసిందనే ఆరోపణలు వస్తున్నాయి. కేవలం లేఖ రాసి చేతులు దులిపేసుకున్నదనే విమర్శలు ఉన్నాయి. దీంతో కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంపై మిర్చి రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్ర సర్కారు వైఫల్యం.. తమ పాలిట శాపంగా మారిందని వారు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకొని కేంద్రంతో మాట్లాడి తెలంగాణ మిర్చి పంటను కూడా కొనుగోలు చేసేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆగని 'ఆర్థిక' పతనం

మొదటిపేజీ తరువాయి...

ఇదే సమయానికి రెవెన్యూ రాబడులు 63.20 శాతంగా ఉండటం గమనార్హం. ఇక ఏటికేడు పోల్చిచూసినప్పుడు రెవెన్యూ రాబడుల క్షీణత కొనసాగుతున్నది. నిరుడితో పోల్చితే జనవరి నాటికి రెవెన్యూ రాబడుల్లో రూ.13,044.9 కోట్లుగా నమోదైందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు జీఎస్టీ వసూళ్లలోనూ తగ్గుదల నమోదైంది. ఈ ఏడాది రూ.58,594.91 కోట్లుగా అంచనా వేయగా రూ.42,657.9 కోట్లు వచ్చాయి. లక్ష్యంలో ఇది 72.8 శాతం. అయితే.. ఇదే సమయానికి నిరుడు జీఎస్టీ వసూళ్లు 75 శాతం నమోదైంది. బీఆర్‌ఎస్ పాలనలో సొంత రాబడుల వృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలిచిన తెలంగాణ.. ఇప్పుడు బడ్జెట్ అంచనాలను చేరుకోవడానికి ఆపసోపాలు పడుతున్నదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

నేలకరిచిన 'రియల్' రంగం

హైడ్రా, మూసీ సుందరీకరణ, ఎఫ్‌టీఎల్ పేరుతో బెదిరింపులు, విచ్చలవిడి వసూళ్లు.. ఇలా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రియల్ ఎస్టేట్ రంగంపై అనేక కోణాల్లో దాడి జరుగుతూనే ఉన్నది. ఫలితంగా 13 నెలల్లోనే రియల్ ఎస్టేట్ రంగం నేలకరిచిందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గతేడాది జూన్‌లో హైడ్రాను ఏర్పాటు చేసినప్పటి నుంచి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం తగ్గడం మొదలైంది. ఈ ఏడాది జనవరి నాటికి ఇది పతాక స్థాయికి చేరిందని.. రియల్ రంగం ఏకంగా నేలకరిచిందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఏడాది స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రూ.18,228.82 కోట్లు సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. కానీ, పది నెలలు గడిచిన తర్వాత జనవరి నాటికి రూ.5,821.88 కోట్లు మాత్రమే వచ్చాయి. ఇది లక్ష్యంలో 31.94 శాతమే. నిరుడు ఇదే సమయానికి ఖజానాకు ఆ శాఖ ద్వారా రూ.11,700 కోట్ల ఆదాయం వచ్చింది. అంటే ఈసారి సగానికి పడిపోయినట్టు లెక్క. కరోనా కాలంలోనూ పెద్దగా ప్రభావితం కాని రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ పాలనలో కుదేలైందని ఆ రంగ నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఒక్క రియల్ రంగంతో ఆగిపోదని, దీని ప్రభావం ఇతర రూపాల్లో ఖజానాపై కనిపిస్తుందని చెప్తున్నారు.

భారీగా పెరిగిన అప్పులు

రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందంటూ బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించిన కాంగ్రెస్.. ఇప్పుడు ఏకంగా అంచనాలకు మించి అప్పులు చేసినట్టు నివేదిక వెల్లడించింది. ఈ ఏడాది రూ.49,255.41 కోట్లు అప్పులు చేస్తామని బడ్జెట్‌లో అంచనా వేసింది. కానీ, జనవరి నాటికే రూ.58,586 కోట్లు రుణాలు తీసుకున్నది. అంటే బడ్జెట్ అంచనాలను అధిగమించి 118.94 శాతం రుణాలు పెరిగాయి. ఇంకా రెండు నెలలు మిగిలి ఉన్న నేపథ్యంలో ఇవి మరింత పెరిగే అవకాశం ఉన్నదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఓవైపు ఆదాయం సృష్టించలేక.. మరోవైపు అప్పుల భారం మోపుతూ ప్రభుత్వం తన అసమర్థతను చాటుకుంటున్నదని ఆర్థిక నిపుణులు మండిపడుతున్నారు. ఈ సంక్షోభం ఇలాగే కొనసాగితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత లోతుల్లోకి జారిపోవడం ఖాయమని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా రాబడి పెంచే మార్గాలు అన్వేషించాలని సూచిస్తున్నారు.

సీఎం శాఖకు నిధుల కరువు

- ఎస్‌ఎస్‌ఏ నిధుల వాటా విడుదల చేయని రాష్ట్ర ప్రభుత్వం
- మూలుగుతున్న కేంద్రం వాటా
- వచ్చే విద్యా సంవత్సరంలో 300 కోట్లు కట్ చేసిన కేంద్రం!

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి సరిగా ఆదాయం లేదని సందర్భం వచ్చినప్పుడల్లా చెప్పే ప్రభుత్వ పెద్దలు.. కేంద్రం నిధులను ఎలా ఖర్చుపెట్టుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. ఇందుకు సమగ్ర శిక్ష పథకమే ఉదాహరణ. ఈ పథకం నిర్వహణకు కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులను కేటాయిస్తాయి. అయితే 2024 -25 విద్యాసంవత్సరానికి రూ.1,913 కోట్లకు ఆమోదం లభించింది. దీంట్లో కేంద్రం వాటా రూ.1,148.34 కోట్లు కాగా, రాష్ట్ర వాటా రూ.765. 56కోట్లు. కేంద్రం ఇప్పటివరకు మూడు ఇన్‌స్టాల్‌మెంట్ల నిధులను విడుదల చేసింది. మూడో ఇన్‌స్టాల్‌మెంట్ కింద కేంద్రం రూ.242 కోట్లను విడుదల చేయగా.. రాష్ట్రం తన వాటా కింద రూ.161 కోట్లను విడుదల చేయాలి. కానీ విడుదల చేయలేదు.

వచ్చే విద్యా సంవత్సరంపై ప్రభావం

రాష్ట్ర ప్రభుత్వ తీరును పరిగణనలోకి తీసుకున్న కేంద్రం వచ్చే విద్యా సంవత్సరంలో కోత పెట్టింది. 2025-26కు సంబంధించి ఎస్‌ఎస్‌ఏ బడ్జెట్‌లో రూ.1,600 కోట్లకే ప్రతిపాదనలు ఉండాలని సీలింగ్ విధించింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో (2024-25) రూ.1,913 కోట్ల బడ్జెట్ కేటాయించగా.. వచ్చే విద్యా సంవత్సరంలో దీన్ని రూ.1,600 కోట్లకు కుదిస్తున్నది. ఈ లెక్కన రూ.300 కోట్ల వరకు కోత విధించినట్టే.